

పార్కింగ్ ప్రదేశంలో పెద్ద సంఖ్యలో వాహనాలు



రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల పాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశ, విదేశాలతో పాటు, రాష్ట్రం నుంచి వచ్చిన ప్రముఖులతో సమ్మిట్ ప్రాంగణం రోజంతా సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడి, ఒగ్గు డోలు, మహిళల డప్పులు, పేరణి నృత్యం, కోలాటం తదితర కళారూపాలతో అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఉదయం నుంచే ఫ్యూచర్ సిటీ రోడ్లన్నీ వాహనాలతో రద్దీగా మారాయి. తొలిరోజు దాదాపుగా 2 వేల మందికిపైగా అతిథులు హాజరయ్యారు.



సమ్మిట్ ప్రాంగణంలో దేశ, విదేశీ అతిథుల సందడి



సంబురంగా సమ్మిట్

రద్దీగా రహదారులు

అతిథులు, అధికారుల వాహనాలతో ఫ్యూచర్ సిటీ రోడ్లన్నీ రద్దీగా మారాయి. సోమవారం ఉదయం నుంచే అక్కడి చేరుకున్న రాష్ట్ర నలుమూలల నుంచి మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వాహనాలతో పాటు, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, 44 దేశాలకు సంబంధించి 154 మంది ప్రముఖుల రాకతో తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొత్తూరు గేట్ మీదుగా గ్లోబల్ సమ్మిట్ ప్రాంతం వరకు వాహనాలతో కిటకిటలాడింది. ప్రపంచ నలుమూలల నుంచి ఆర్థికవేత్తల రాకతో ఆదివారం రాత్రి నుంచి సుమారు 4వేల మంది పోలీస్ బలగాలు రంగంలోకి దిగారు. కందుకూరు, తుక్కుగూడలో కవాతు నిర్వహించారు. అనంతరం ఈ రెండు ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకుని పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆకర్షణగా రోబో..

ఈ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అక్కడకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా రోబో హాయ్ సీఎం అంటూ పలకరించడం విశేషం. తిరిగి ముఖ్యమంత్రి కూడా రోబోకు హాయ్ చెబుతూ ముందుకు సాగారు.



తొలిరోజు అట్టహాసంగా ఆర్థిక సదస్సు

బారులుతీరిన దేశ, విదేశీ ప్రతినిధులు.. తెలంగాణ సంస్కృతితో ఆహ్వానం

- నయా నగర నిర్మాణానికి మేధోమథనం
- భవిష్యత్ ప్రాజెక్టులపై నిష్ణాతులతో చర్చాగోష్ఠులు
- పెట్టుబడులే లక్ష్యంగా కీలక ఒప్పందాలు

రంగారెడ్డి అర్బన్/కందుకూరు/షాద్‌నగర్/మహేశ్వరం/ఇబ్రహీంపట్నం/కొందుర్గు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో రాజధానికి అతి సమీపంలో మరో నయా నగర నిర్మాణానికి బాటలు వేస్తోంది. ఇందులో భాగంగా' తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను రెండు రోజుల పాటు నిర్వహిస్తోంది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్కాన్‌పేట - బేగరికంచలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో సోమవారం నయా నగర నిర్మాణానికి ఆర్థిక మేధోమథనం జరిగింది. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి ప్రముఖ ఎంఎన్‌సీల ప్రతినిధులతో పాటు ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, ప్రముఖలతో చర్చాగోష్ఠులు చేపట్టింది. సదస్సుకు తొలిరోజు దాదాపుగా 2వేల మందికిపైగా అతిథులు హాజరయ్యారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ్మిట్‌ను

మిగతా 6వ పేజీలో...



సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినీ నటుడు నాగార్జున, మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు

నేనే.. ఉపసర్పంచ్!

ఎలాగైనా నన్ను ఎన్నుకోవాలి

మీరేమి చేసుకుంటారో నాకు తెలియదు.. ఉప సర్పంచ్ పదవి నాకే దక్కాలి. మీరు ఎవరికి సపోర్ట్ చేయమంటే వారికి చేస్తా. ఆర్థికంగా కూడా సహాయపడతా. కానీ మీరు నన్నే ఉప సర్పంచ్‌గా ఎన్నుకోవాలి. ఎంత ఖర్చయినా భరిస్తానంటూ పరిగి నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వార్డు అభ్యర్థులకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఆయనకు సర్పంచ్ కావాలన్న కోరిక చాలా కాలంగా ఉంది. గత ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసినా పరిస్థితులు కలిసిరాక ఓటమి పాలయ్యారు. ఈసారి ఎన్నికల్లో రిజర్వేషన్ కలిసి రాక సర్పంచ్ పదవి చేజారిపోగా, ఎలాగైనా ఉప సర్పంచ్ పదవిని దక్కించుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పదవి కోసం తన పలుకుబడిని ఉపయోగించి సర్వశక్తులొడ్డుతున్న ఆయన ఇంతకు ముందు ఎంపీటీసీ పదవిలో కొనసాగగా, ఆయన సతీమణి ఆ గ్రామ సర్పంచ్‌గా కొనసాగారు.

మీరు మద్దతు ఇవ్వాలి.. ఖర్చు ఎంతయిన భరిస్తా

- సర్పంచ్ రిజర్వేషన్లు కలిసిరాని చోట విశ్వప్రయత్నాలు
- తమకే మద్దతిచ్చేలా తాయిలాలతో ఒప్పందం
- మెజార్టీ వార్డు సభ్యుల మద్దతు ఉండేలా చర్యలు
- జాయింట్ చెక్‌పవర్‌తో గ్రామాల్లో భారీగా పోటీ



వికారాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రిజర్వేషన్లు కలిసి రాని పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవికి డిమాండ్ పెరిగింది. సర్పంచ్ పదవుల రిజర్వేషన్లు అనుకూలంగా రాని పంచాయతీల్లో బడా నాయకులు తమ ఆధిపత్యం చెలాయించేందుకు ఉప సర్పంచ్ పీఠాలపై కన్నేశారు. మహిళా అభ్యర్థులు సర్పంచులుగా బరిలో నిలిచిన పంచాయతీల్లో వార్డు స్థానాలకు అధిక సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. రిజర్వు కేటగిరికి చెందిన వ్యక్తి సర్పంచ్‌గా ఎన్నిక కానున్న నేపథ్యంలో ఉప సర్పంచ్‌గా తమనే ఎన్నుకోవాలంటూ ఇప్పటి నుంచే వార్డు సభ్యుల అభ్యర్థులకు షరతు విధిస్తున్నారు. ఎన్నికల్లో

మిగతా 8వ పేజీలో...

సమ్మిట్‌కు 'మేడ్చల్' విద్యార్థులు

» కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ప్లీనరీ సమావేశాలకు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా విద్యార్థులు హాజరవుతున్నట్లు కలెక్టర్ మను చౌదరి సోమవారం తెలిపారు. 10వ తేదీన జరిగే ప్లీనరీ సమావేశాలకు ఘట్‌కేసర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల నుంచి 966 మంది, 13న ఘట్‌కేసర్ వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ కళాశాల నుంచి 200 మంది, దూలపల్లిలోని మల్లారెడ్డి యూనివర్సిటీ నుంచి 200 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్లోబల్ సమ్మిట్ -2025 అనేది ఆవిష్కరణ వ్యవస్థాపక, యువత సాధికారతను ప్రదర్శించే ఒక అంతర్జాతీయ వేదిక అన్నారు. ఇక్కడ ప్లీనరీ సమావేశాలు 10 నుంచి 13వ తేదీ వరకు జరుగనున్నాయన్నారు.

తొలివిడత పోలింగ్‌కు సిద్ధం

నిబంధనలు విధిగా పాటించాలి.. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్, పక్కన ఎస్పీ స్నేహ మెహ్రా

వికారాబాద్, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడత పోలింగ్ జరుగనున్న మండలాల్లో అధికారులు నిబంధనలు పక్కాగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఎంపీడీవో, తహసీల్దార్లతో ఆయన జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో పోలింగ్ డిసెంబర్ 11న జరుగనున్న నేపథ్యంలో 10వ తేదీ ఉదయం 8 గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు హాజరు కావాలన్నారు. భోజనం అనంతరం పోలింగ్ మెటీరియల్‌ను స్వీకరించి వెంటనే పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలన్నారు. చెక్‌లిస్టు ప్రకారం బ్యాలెట్ పత్రాలు, మెటీరియల్ పూర్తిగా ఉన్నాయా లేదో క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్‌లో సీటింగ్ అరేంజ్‌మెంట్, సీక్రెట్ ఓటింగ్ కంపార్ట్మెంట్‌ను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్ల గోప్యత వంద శాతం కాపాడాలని ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి రేపటి వరకు ఎంపీడీవో కార్యాలయాల్లో అవకాశం ఉంటుందన్నారు. ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ మొదటి విడత పోలింగ్ సందర్భంగా ఎనిమిది మండలాల అన్ని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొడంగల్, తాండూరులో ప్రత్యేక ఫోర్స్‌ను మోహరించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అదనపు ఎస్పీ రాములునాయక్, డీఆర్వో మాంగీలాల్, డీపీవో జయసుధ, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే 'స్కానింగ్'

» జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వర్ణకుమారి

వికారాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ సేవలు అందించే సెంటర్లు, ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి హెచ్చరించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం ప్రకారం ప్రతీ రేడియాలిజిస్టు, గైనకాలజిస్ట్ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో తప్పని సరిగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. సోమవారం పట్టణంలోని హృదయ హాస్పిటల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో పనిచేస్తున్న స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసి, రికార్డులు, ఆన్‌లైన్ ఎంట్రీలు, వైద్యుడి అర్హత సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, లేబరేటరీలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసి మాత్రమే సేవలు అందించాలని ఆమె ఆదేశించారు. లేని పక్షంలో పీసీపీఎన్‌డీటీ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టాల ప్రకారం జరిమానాలు, సీజ్ చర్యలు లేదా అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మోమిన్‌పేట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. మేకవనంపల్లి పాఠశాలకు చెందిన బాలికల విభాగంలో ధనలక్ష్మి, బాలుర విభాగంలో శ్రీకాంత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్, ఉపాధ్యాయులు ఆ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసికోల్లాసం, శారీరక దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న లింగ్యానాయక్

మేడ్చల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/వికారాబాద్: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తంగా 12 ఫిర్యాదుల వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో మంగ్లీలాల్, ఆర్డీవో వాసుచంద్ర, డీఆర్‌డీవో శ్రీనివాస్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో 114 ఫిర్యాదులు



మేడ్చల్ కలెక్టరేట్‌లో..


ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్వో హరిప్రియతో కలిసి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 114 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

మద్యం దుకాణాల బంద్

ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్



వికారాబాద్, డిసెంబర్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలపై తాత్కాలిక నిషేధం విధించనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్ పేర్కొన్నారు. మూడు దశల్లో ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. మొదటి విడతలో నేటి (డిసెంబర్ 9) సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబరు 11 వరకు తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల పరిధిలోని దుకాణాలు తాత్కాలికంగా మూసి వేస్తున్నట్లు తెలిపారు. రెండో విడతలో డిసెంబరు 12 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబరు 14 వరకు వికారాబాద్, ధారూరు, నవాబుపేట, మోమిన్‌పేట ప్రాంతాల్లో మూసి వేస్తున్నట్లు తెలిపారు. మూడో విడతలో డిసెంబర్ 15 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 17 వరకు పరిగి, దోమ, చేవెళ్ల, పూడూరు, కుల్కచర్ల మండలాల్లో దుకాణాలు మూసివేయనున్నారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా సాగాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని, నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు.



సంబురంగా సమ్మిట్

(ఐదో పేజీ తరువాయి)

ప్రారంభించి ప్రసంగించారు. ఉదయం 11 గంటల నుంచి అతిథుల రాక ప్రారంభమైంది. ఈ సదస్సుకు ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున, కే.కేశవ రావు, రంగారెడ్డి జిల్లా నుంచి పలువురు ప్రతినిధులు హాజరయ్యారు.

తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా..

వీవీఐపీ పారిశ్రామికవేత్తలకు డీఎస్పీ స్థాయి అధికారితో భద్రతా కల్పించారు. వీవీఐపీ పారిశ్రామికవేత్తలకు, సీనియర్ అధికారులకు ప్రత్యేకంగా యాక్సెస్ పాస్‌లు జారీచేశారు. సమ్మిట్ హాజరయ్యే ప్రతినిధులను ఆకట్టుకునేలా అత్యాధునిక టెక్నాలజీ హంగులు, రంగురంగుల జెండా మేళవింపుతో స్వాగతం పలికారు. అడుగడుగునా చారిత్రాత్మక కట్టడాల నమూనాలు, పర్యటక ప్రదేశాలను భారీ స్క్రీన్లతో ప్రదర్శించారు. అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బేగరికంచ వరకు విద్యుత్ దీపాలంకరణలతో కటౌట్లు, ఫ్లెక్సీలు, భారీ ప్రొజెక్టర్లతో ప్రదర్శించారు.

56 గ్రామాల్లో అనువుగా..

ఈ సందర్భంగా 2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించినట్టుగా వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో గ్రీన్ అగ్రికల్చర్, మహిళలు, యువతకు స్కిల్, ఐటీ, ఫార్మా, విద్యా, వైద్యం, పర్యాటకం, తదితర సంస్థలను నెలకొల్పే విజన్‌తో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మొత్తం 56 గ్రామాల్లో భూములు అనువుగా ఉన్న చోట ఒక్కో సంస్థను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం పక్కా ప్రణాళికను రూపొందించింది.

అతిథులకు అంతరాయం కలుగకుండా

సమ్మిట్‌కు హాజరయ్యే అతిథుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నారు. మొత్తం ఏడు ప్రాంతాల్లో పార్కింగ్ జోన్‌లను ఏర్పాటు చేశారు. అతిథులు ఎక్కడ తమ వాహనాలను పార్క్ చేయాలన్న సమాచారంతో కూడి పాస్‌లు వారికి అందజేశారు. ప్రతీ పార్కింగ్ ఏరియాకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను కేటాయించారు. కోడ్‌ను స్కాన్ చేయడంతో ఆయా పార్కింగ్ స్థలాలకు వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. వీవీఐపీలు, వీఐపీలు వస్తున్న వాహనాలకు అంతరాయం కలుగకుండా పలుచోట్ల ట్రాఫిక్‌ను మళ్లించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మీర్ఖాపేట్‌లోని సమ్మిట్ జరిగే ప్రాంతం వరకు వేలాది వాహనాలు తరలిరావడంతో, అడుగడుగునా పోలీసులను అందుబాటులో ఉంచారు.



గ్లోబల్ సమ్మిట్ ముఖద్వారం వద్ద అతిథుల సందడి





గ్లోబల్ సదస్సు హైలెట్స్

- ఉదయం 10:30 గంటలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ సదస్సుకు హాజరు
- 10:35 గంటలకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క రాక
- 11:00 గంటలకు మంత్రులు తుమ్మల, అజారుద్దీన్
- 11:35 గంటలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- 11:38 గంటలకు సినీ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తల రాక
- 11:40 గంటలకు ఉపముఖ్యంత్రి బట్టి విక్రమార్క
- 12:00 గంటలకు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్
- 12:45 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 12.55 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- 1.30 గ్లోబల్ సమ్మిట్ ప్రారంభం
- 2:10 గంటలకు నగరానికి బయల్దేరిన గవర్నర్

గవర్నర్‌కు ఘన స్వాగతం

మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.55 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అక్కడకు చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

పాస్‌లు ఉంటేనే అనుమతి

గ్లోబల్ సమ్మిట్ వెళ్లే రహదారి మొదలుకుని ప్రాంగణం వరకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పాస్‌లు లేకుండా ఎవరినీ అనుమతించలేదు. ప్రతీ ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే ప్రాంగణం లోపలికి అనుమతించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే రహదారులను సైతం పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

ఫ్యూచర్‌సిటీలో భారీ పెట్టుబడులు: కేఎల్ఆర్



రాబోయే తరాలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కందుకూరు మండలం మీర్ఖాన్‌పేటలో చేపడుతున్న ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపారని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడ స్కిల్ యూనివర్సిటీ, ఫ్యూచర్ సిటీ, కమిషనర్ కార్యాలయ భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని చెప్పారు. అలాగే రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ 13 నుంచి మీర్ఖాన్‌పేట వరకు, మీర్ఖాన్‌పేట నుంచి ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి వరకు రీజినల్ రింగురోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పారిశ్రామిక దిగ్గజాలకు ఘనస్వాగతం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 08 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుంచి వస్తున్న పారిశ్రమిక వేత్తలు, డెలిగేట్స్‌కు సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో టూరిజం శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. తెలంగాణ సంస్కృతిక, సంప్రదాయలు ఉట్టిపడేలా అతిరథ మహారథులకు స్వాగతం పలికారు. అతిథులకు విద్యార్థినులు నృత్యాలు చేసుకుంటూ వెల్‌కం చెప్పారు. న్యూజిలాండ్, జింబాబ్వే, ఇంగ్లాండ్, అమెరికా వీరితో పాటు మరి కొన్ని దేశాల నుంచి దాదాపు 154 మంది పారిశ్రామిక వేత్తలు, డెలిగేట్స్ , వివిధ కంపెనీల ప్రతినిధులు ఎయిర్‌పోర్టు నుంచి కందుకూర్ మండలం మీర్‌ఖాన్‌పేట్‌లో ఉన్న గ్లోబల్ సమ్మిట్‌కు బయలుదేరి వెళ్లారు. వీవీఐపీలు రావడంతో ఎయిర్‌పోర్టులో సందడి నెలకొంది. శంషాబాద్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి సమ్మిట్‌కు వెళ్లే వరకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని పలువురు పారిశ్రమిక వేత్తలు అన్నారు.

వ్యక్తి అదృశ్యం


వినుమోన్(ఫైల్)

శంషాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కేరళ రాష్ట్రంలోని తిరువనంతపూర్‌కు చెందిన వినుమోన్ ఈ నెల 3న శంషాబాద్‌లోని హోటల్ ప్రైమ్ వద్ద అదృశ్యమయ్యాడు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతకగా ఫలితం లేకపోవడంతో సోమవారం వినుమోన్ భార్య స్మిత శంషాబాద్ ఆర్‌జీఐ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న నగదు, పాస్‌పోర్ట్‌లు అందజేత

శంషాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు పోగొట్టుకున్న నగదు, పాస్‌పోర్ట్‌లను ఎయిర్‌పోర్టు సిబ్బంది సోమవారం బాధితులకు అందించారు. జిద్దా నుంచి వచ్చిన ఎండీ.మక్సూద్ అలీ ఎయిర్‌పోర్టులో 20 గ్రాముల బంగారం, నగదు రూ.10 వేలు, పాస్‌పోర్టు, మొబైల్ ఫోన్ కలిగిన బ్యాగు, మరో ఇద్దరు రాహుల్ పాస్‌పోర్ట్, ధూపతి గోపి విద్యా ధృవీకరణ పత్రాలు గల బ్యాగులు పోగొట్టుకుపోయాయని ఇటీవలే ఎయిర్‌పోర్టులో పోలీసు అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశారు. సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించి గుర్తించిన నగదు, పాస్‌పోర్ట్‌లను ఆర్‌జీఐఏ ఎస్సై కనకమయ్య సమాపతి సోమవారం బాధితులకు అందించడంతో వారు ధన్యవాదాలు తెలిపారు.



నగదు, పాస్‌పోర్ట్ బ్యాగును అందిస్తున్న ఎస్సై కనకమయ్య సమాపతి



కొడంగల్‌లో పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

బొంరాస్‌పేట్: ఓటు హక్కు వినియోగించుకుంటున్న సిబ్బంది





మొదలైన పోస్టల్ ఓటింగ్

కొడంగల్ రూరల్/బొంరాస్‌పేట్, డిసెంబర్ 8 ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11న ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఓటును వినియోగించుకుంటున్నారు. సోమవారం బొంరాస్‌పేట్, కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు తదితర ఉద్యోగులు మొదటి రోజు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. బొంరాస్‌పేట్‌లో మొదటి రోజు 21 ఓట్లు పడ్డట్లు ఎంపీడీవో వెంకన్న గౌడ్ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

ఒకరి అరెస్టు.. ఆటో సీజ్

యాచారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నిల వేళ మద్యం అక్రమ రవాణా కాకుండా పోలీసులు నిఘా పెంచారు. యాచారం మండలం బానుతండాకు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 19 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి పోలీసులు మాల్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బానుతండకు చెందిన జె.కిషన్(32) ఆటోలో మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆటోతో పాటు మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



యాచారం మండలం మాల్ సమీపంలో పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

ముమ్మరంగా వాహన తనిఖీలు

రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నేపథ్యంలో హైదరబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధి బేగరికంచలో పోలీసులు పటిష్ట భద్రతాచర్యలు తీసుకున్నారు. యాచారం నుంచి కందుకూరుకు వచ్చి పోయే వాహనాదారులను ఇదే రహదారిపై అనుమతించారు. మీర్‌ఖాన్‌పేట రైతులకు పెద్దమ్మ ఆలయం వరకు పంట భూములుండడంతో రైతులను అనుమతించారు. పవర్‌గ్రిడ్ వద్ద బారికేడ్లతో కందుకూరు వరకు అనుమతించారు.

సంగ్రామం 2025

www.andhrajyothy.com



నీళ్లపల్లిలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

బషీరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలాభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నీళ్లపల్లి, జలాల్‌పూర్, ఇస్మాయిల్‌పూర్ గ్రామాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రజా సంక్షేమానికి అనునిత్యం తపించే నాయకుడు సుధాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. తన వంతుగా గ్రామాభివృద్ధికి సహకారిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సమన్వయ కర్త కరుణంపురుషోత్తంరావు, ఏకాంబరి దేస్థానం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది సుదర్శన్‌రెడ్డి, చిన్న వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహులు, మాజీ ఎంపీటీసీ బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా సహాయ ఎన్నికల అధికారి మాధురి



ఆమనగల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 14న జరిగే పోలింగ్‌కు ఆమనగల్లు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా సహాయ ఎన్నికల అధికారి కుసుమ మాధురి తెలిపారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల ఏర్పాట్ల గురించి వివరించారు. మండలంలో 13 సర్పంచ్, 112 వార్డులకు కోనాపూర్ సర్పంచ్‌కు ఒకే నామినేషన్ రావడంతో బెల్లంకొండ శ్రీలత ఏకగ్రీవమయ్యారని, అలాగే 20 వార్డు స్థానాలు ఏకగ్రీవమైనట్లు పేర్కొన్నారు. ఎన్నికలు జరిగే 12 సర్పంచ్ స్థానాలకు 41 మంది అభ్యర్థులు, 92 వార్డులకు 278 మంది పోటీలో ఉన్నట్లు వెల్లడించారు. ప్రతి వార్డుకు ఒక పోలింగ్ బూత్ చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి బూత్‌కు ఒక పీవో, ఒక ఏపీవోతో పాటు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఆమనగల్లు మండలంలో ఎన్నికల విధులకు సుమారు 400 మంది అధికారులు, సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్లు ఇప్పటికే మండల కేంద్రానికి చేరుకున్నాయని, పోలింగ్‌కు ముందు రోజే ఓటర్లకు ఓటరు స్లిప్పులు అందజేస్తామన్నారు. 14న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పోలింగ్, 2 తర్వాత కౌంటింగ్ ప్రారంభించి ఫలితాలు వెల్లడించడంతో పాటు ఉప సర్పంచ్ ఎన్నిక జరుగుతుందని వివరించారు.

మాజీ ఎమ్మెల్యేల భేటీ

నారాయణరావు ఇంటికి పైలెట్ రోహిత్‌రెడ్డి

జిల్లాలో చర్చనీయాంశమైన ఇద్దరి నేతల కలయిక



మాజీ ఎమ్మెల్యే నారాయణరావు ఇంట్లో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

బషీరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల వేళ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి బషీరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే నారాయణరావు నివాసానికి వెళ్లడం చర్చనీయాంశమైంది. సోమవారం బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కాంగ్రెస్‌కు చెందిన నారాయణరావు ఇంటికి వచ్చారు. స్థానిక రాజకీయాలు, పంచాయతీ ఎన్నికల్లో గెలుపోటములపై కొంత సేపు చర్చించుకున్నారు. బషీరాబాద్ పంచాయతీ సర్పంచ్ బరిలో మహరాజుల కుటుంబం నుంచి ఎస్.వెంకటేష్ ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పైలట్ రోహిత్‌రెడ్డి నారాయణరావును కలువడంపై రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలను పలకరించగా మర్యాదపూర్వకంగా కలుసుకున్నామని, విశేషమేమిలేదని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పైలట్ వెంట బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి శ్రీశైల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి తదితరలు ఉన్నారు.

విపక్షాలను నమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విపక్షాల మాటలు నమ్మి మోసపొవద్దని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కల్వకుర్తి, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో కల్వకుర్తి నియోజకవర్గం అద్భుత ప్రగతి సాదించిందన్నారు. పంచాయతీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్, బీజేపీలు కనుమరుగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, యాట నర్సింహ, గూడూరు భాస్కర్‌రెడ్డి, భట్టు కిషన్‌రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, ఆనంద్, పర్వత్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మోతీలాల్, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, బీచ్యనాయక్, బీక్యనాయక్, బోజ్జ సాయిరెడ్డి, సూదిని కొండల్ రెడ్డి, విజయ్, జక్కు అనంత రెడ్డి, గుర్రం కేశవులు, మండ్లీరాములు పాల్గొన్నారు.



ఇన్ముల్‌నర్వలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపెడుతాం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, డిసంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపెడుతామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ, కొడిచర్లతండాలో కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇన్ముల్‌నర్వలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు, రేషన్‌కార్డులు, భూగర్భ మురుగునీటి కాల్వల నిర్మాణాలు వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. పార్టీ మద్దతుతో పోటీలో నిలిచిన అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అంతకుముందు వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, సుదర్శన్‌గౌడ్, లింగంనాయక్, శంకర్‌నాయక్, బల్వంత్‌రెడ్డి, షిరాజ్, హమీద్, బాబుముదిరాజ్, బిచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో యువతే కీలకం



కులకచర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో యువత ఓట్లు కీలకం కానున్నాయి. వారు ఎటువైపు ఓట్లు వేస్తే ఆ అభ్యర్థి గెలిచే చాన్స్ ఎక్కువ కనిపిస్తోంది. ఇంట్లో తల్లిదండ్రులు సైతం అంతా పిల్లలదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో పంచాయతీ ఎన్నికలొస్తే అభ్యర్థులు గ్రామ, కుల పెద్దలను కలిసి మద్దతు కోరే వారు. పెద్దల మాటకు కట్టుబడి అంతా ఓటేసే వారు. అందుకు అభ్యర్థి కులాల వారీగా టెంట్ సమాను, డబ్బులు చెల్లించేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. పోటీలో నిలబడిన అభ్యర్థులు యువ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి శాయశక్తులు ఒడ్డుతున్నారు. యువత సైతం పంచాయతీ ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి!

ఆస్పత్రి ఎదుట మృతదేహంతో కుటుంబీకుల ఆందోళన



లావణ్య(ఫైల్)



లావణ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

శంకర్‌పల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతోనే లావణ్య మృతి చెందిందంటూ.. ఆమె కుటుంబీకులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. శేరిగూడ గ్రామానికి చెందిన వడ్డె లావణ్య(27) సోమవారం ఉదయం కళ్లు తిరిగి కింద పడిపోయింది. కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం శంకర్‌పల్లిలోని స్వరాజ్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించగా ఆమె ఆరోగ్యం కొద్దిసేపు నిలకడగానే ఉంది. అయితే ఆమె బాత్‌రూమ్‌కు వెళ్లి వస్తూ మళ్లీ కిందపడిపోయింది. వెంటనే వైద్యులు ఆమెకు సీపీఆర్ చేశారు. మెరు గైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో కుటుంబీకులు అంబులెన్స్‌లో సంగారెడ్డికి తరలిస్తుండగా ఆమె మార్గమధ్యలోనే మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే లావణ్య మృతి చెందిందంటూ ఆమె కుటుంబీకులు ఆరోపిస్తూ ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. మెరుగైన వైద్యం అందిస్తే లావణ్య బతికేదని విలపించారు. సమాచారం అందుకున్న శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ అక్కడకి చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. భర్త రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా ఆమెకు పిల్లలు చైత్ర, ప్రజ్ఞ శ్రీ, భానుప్రసాద్ ఉన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చేవెళ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. సోమవారం మల్కాపూర్ వార్డులో సద్దుల ఈశ్వరమ్మ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని, అనంతరం సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి నిరుపేదకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలనే ప్రభుత్వం రూ.5లక్షలతో ఇళ్లు కట్టిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బక్కరెడ్డి యాదిరెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బల్వంత్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మోసిన్, శివారాజ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్

ఘట్‌కేసర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాటాలు సాగించేది కమ్యూనిస్టులేనని సీపీఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. సోమవారం పోచారం మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలో జరిగిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశానికి హాజరై మాట్లాడారు. పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే కూల్చివేస్తున్న అధికారులు బాడానేతల ఆదీనంలో ఉన్న భూములను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. పోచారం పరిధిలోని ఆర్జీకే కాలనీలో దివ్యాంగుల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఏడెకరాలు కేటాయించింది. అందులో మూడెకరాల్లో ఇళ్లు నిర్మించగా మిగిలిన రెండెకరాలు ఆక్రమణలకు గురైందని ఆరోపించారు. కార్యక్రమంలో జయచంద్ర, ఈశ్వర్, అన్వర్‌పాషా, సరిత, ఖదీర్, సదాశివ, మురళి, కిష్టయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలను పెంచుకోవాలి

ఆమనగల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చదువుతో పాటు జీవన నైపుణ్యాలు, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. కలలపై పట్టు సాధించాలని సూచించారు. సోమవారం కన్యకా పరమేశ్వరి ఆలయంలో శృతిలయ కల్చరల్ అకాడమి, వందేమాతరం ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో విద్యార్థినులకు కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. అకాడమి చైర్మన్ చిత్తరంజన్‌దాస్, మానవతా వ్యవస్థాపకులు డాక్టర్ రమ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాము హాజరయ్యారు. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ రవికాంత్, ప్రియ, అకాడమి ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, భాస్కర్, నాగేశ్ పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బెడదను అరికట్టాలి

ఆమనగల్లు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ శంకర్‌కు వీధి కుక్కలు, కోతుల బెడదను అరికట్టాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్ మాట్లాడుతూ వీధుల్లో చిన్న పిల్లలు ఆడుకునే సమయంలో వీధి కుక్కల స్వైరవిహారంతో భయాందోళన చెందుతున్నారన్నారు. ఉదయం, రాత్రి వేళల్లో కాలనీల్లో గుంపులుగా సంచరిస్తూ దారి వెంబడి వెళ్లే వారిని వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. అదే విధంగా కోతుల బెడద అధికమైందని, ఇళ్లలోకి చొరబడి తినుబండరాలు తదితర వాటిని నాశనం చేస్తున్నాని వాపోయారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కల లక్ష్మణ్, కృష్ణ, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో కిషన్‌నగర్‌వాసికి

అరుదైన గౌరవం

మిచిగాన్ రిపబ్లికన్ పార్టీ కోచైర్మన్‌గా సన్నీరెడ్డి



షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మిద్దెల చిన్నారెడ్డి అలియాస్ సన్నీరెడ్డికి అమెరికాలో అరుదైన గౌరవం లభించింది. మిచిగాన్ రిపబ్లికన్ పార్టీ కోచైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బృందంలో సభ్యుడిగా తెలుగువాడు నిలిచాడు. 50 రాష్ట్రాల నుంచి ఒక్కొక్కరిని కో-చైర్మన్‌గా ఎన్నుకుంటున్నారు. మిచిగాన్ రాష్ట్రం నుంచి సూచనలు, సలహాలు ఇవ్వడానికి సన్నీరెడ్డిని ఎన్నుకున్నారు. మిచిగాన్ రాష్ట్రంలో స్థిరపడిన సన్నీరెడ్డి ఇప్పటికే వెయిన్ స్టేట్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మెంబర్‌గా పనిచేస్తున్నారు. 1994లో వెయిన్ స్టేట్ యూనివర్శిటీ నుంచి కెమికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ పొందిన సన్నీరెడ్డి అదే యూనివర్శిటీకి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మెంబర్‌గా ఎన్నికకావడం విశేషం. ఇటీవల తన సొంత గ్రామమైన కిషన్‌నగర్‌కు వచ్చి, ఆగ్రామ శివాంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. సన్నీరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు అగ్రరాజ్యంలో కో-చైర్మన్‌గా నిలపడంతో షాద్‌నగర్ ప్రాంతవాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు వ్యతిరేకంగా విత్తన బిల్లు



శామీర్‌పేటలో విత్తన సవరణ బిల్లు పత్రాలను కాల్చివేస్తున్న నాయకులు

శామీర్‌పేట/కొడంగల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా విత్తన బిల్లును ప్రవేశపెట్టడం దారుణమని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మలానరసింహ అన్నారు. సీపీఐ సంయుక్త కిసాన్ మోర్చ(ఎస్‌కేఎం) పిలుపు మేరకు సోమవారం శామీర్‌పేట మండల కార్యాలయాల సమీపంలో నాయకులు ముసాయిదా విత్తన బిల్లు - 2025ను వ్యతిరేకిస్తు పత్రాలను కాల్చివేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి నరేంద్రప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దశరథ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల వెంకట్‌రెడ్డి, సాయిలుగౌడ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

ఆహార భద్రతను, విత్తన స్వావలంబనను దెబ్బతీసేలా విత్తన ముసాయిదా బిల్లు ఉందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేశ్‌కుమార్ అన్నారు. సోమవారం కొడంగల్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో ముసాయిదా బిల్లు పత్రాలను దహనం చేశారు. భారత విత్తన రంగంపై బహుళ జాతి సంస్థల ఆధిపత్యాన్ని పెంచేలా ప్రమాదకరంగా బిల్లు ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బాబు, లాలయ్య, చంద్రయ్య, సావిత్రమ్మ, మహిబూబ్‌అలీ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై డీపీవోకు ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వికారాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల సిబ్బంది నియామకంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర అయోమయం నెలకొంటుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ వెంకటరత్నం, ఏ. రాములు డీపీవోకు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీడీవోలు కలెక్టర్ ఆదేశాలు పట్టించుకోకుండా ఎన్నికల ఉత్తర్వులను సంబంధిత ఉద్యోగులకు వ్యక్తిగతంగా ఇవ్వకుండా వాట్సాప్ గ్రూపుల్లో ఉంచడం వల్ల ఒక్కో ఉద్యోగికి మూడు నాలుగు మండలాల్లో విధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఎన్నికల సిబ్బంది తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మండల అభివృద్ధి కార్యాలయాలు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్లో భోజన వసతులు సక్రమంగా లేవని మండిపడ్డారు. ఆరునెలల్లో రిటైర్ అయ్యే ఉపాధ్యాయులు, అంగవైకల్యం ఉన్న ఉద్యోగులను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దశరథ్, అరవింద్, రాములు, శేఖరయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మొద్దు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి

బషీరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మొద్దని, గారడి చేసి అధికారంలోకి వచ్చిందని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని రెడ్డిఘణాపూర్, మల్కన్‌గిరి, నవాల్గ, దామర్‌చెడ్, నవాంద్గీ, వాల్యానాయక్‌తండా తదితర గ్రామాల్లో సోమవారం పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి శ్రీశైల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు ఇందర్‌చెడ్ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్: పంచాయతీ ఎన్నికల్లో కొడంగల్ మండలంలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొడంగల్ మండలంలోని రుద్రారం తదితర గ్రామాల్లో పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించడం అభినందనీయం



సీఐ, ఎస్సైలను సన్మానిస్తున్న నాయకులు

శామీర్‌పేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పోలీసులు ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ దేశ, రాష్ట్ర స్థాయిల్లో గుర్తింపు పొందడం అభినందనీయమని రైతు సమాఖ్య ఉమ్మడి మండలాల మాజీ అధ్యక్షుడు, రైతు సంఘం మండల నాయకుడు బుద్ది అంజనేయులు తెలిపారు. ప్రజలకు ఉత్తమ సేవలందించడంలో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ దేశ స్థాయిలో-7వ స్థానం, రాష్ట్ర స్థాయిలో-1వ స్థానం సాధించిన సందర్భంగా సోమవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనాథ్‌ను సన్మానించారు. అదేవిధంగా సీపీఎం మండల నాయకుడు ఎల్లయ్య, సీఐటీయూ మండల కన్వీనర్, పార్టీ తదితర నాయకులు సీఐ శ్రీనాథ్, ఎస్ఐ, కానిస్టేబుళ్లను సన్మానించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

పూడూరు, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న బురెగెరి శ్రీనివాస్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మాచన్నగారి రామచంద్రారెడ్డి వికారాబాద్ ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన సోమవారం పేర్కొన్నారు. ఎన్నికల మోడల్ కోడ్ అమల్లో ఉన్నప్పటికీ శ్రీనివాస్‌రెడ్డి ఈనెల 6వ తేదీన గ్రామంలోని 6వ వార్డులో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా బోరు వేయించారని తెలిపారు. ఆయన సర్పంచ్ నామినేషన్ రద్దుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

మేడ్చల్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుండ్లపోచంపల్లి మైసమ్మగూడకు చెందిన సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ పోటీల్లో పలువురు విద్యార్థులు పతకాలను సొంతం చేసుకున్నారు. మహేందర్ రజకపతకం సాధించడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తుషార్, శ్రీనిధి యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని సాధించాడు. పథకాలు సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది.

సంక్షిప్తంగా..

శ్మశాన వాటికకు స్థలానికి సర్వే చేయాలి

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సుతారిగూడ గ్రామస్తుల కోసం శ్మశాన వాటిక కోసం స్థలాన్ని కేటాయించినా సర్వే చేయలేదని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. శ్మశానవాటికకు స్థలం లేక సమీపంలోని చెరువు పరిసరాల్లో దహన సంస్కారాలు చేయాల్సివస్తోందని వాపోయారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ఘట్‌కేసర్ రూరల్: విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వేణు గోపాల్ తెలిపారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (ఉప్పల్) పాఠశాలలో సోమవారం నారపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు సాధరణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

దోమ: మండలంలోని బొంపల్లి ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, డ్రగ్స్ మత్తు పదార్థాలు, సమాజానికి హాని కలిగించే వాటిపై సోమవారం విద్యార్థులకు ఎస్సై వసంత్‌జాదవ్‌అవగాహన కల్పించారు. అదే విధంగా కొత్తపల్లి పాఠశాలలో ఉద్యోగం పొందిన దాతలు ముందుకొచ్చి టీవీని బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, ఉపాధ్యాయులు నరేందర్, సీఆర్‌పీ వెంకటేశ్, మల్లేశ్, కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

నేడు పీవోలకు శిక్షణ

కులకచర్ల: మండల పరిధిలో ఎన్నికల నిర్వహణకు ఎంపిక చేసిన పీవోలకు మంగళవారం శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక రైతు వేదికలో ఉదయం 10గంటలకు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇప్పటికే సంబంధిత పీవోలకు తెలియజేసినట్లు తెలిపారు. ఈనెల 17వ తేదీన జరిగే సర్పంచ్ ఎన్నికలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

మహిళలే కీలకం

- బషీరాబాద్ మండలంలో 21,515 మంది మహిళా ఓటర్లు
- వారి చేతుల్లో అభ్యర్థుల భవితవ్యం



బషీరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మహిళలే కీలకం కానున్నారు. సర్పంచులుగా, పోటీ చేసే అభ్యర్థులతో పాటు వార్డు సభ్యుల తలరాతలను మహిళామణులే మార్చబోతున్నారు. మండల వ్యాప్తంగా 39 గ్రామ పంచాయతీల్లో 40,987 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 19,472 కాగా మహిళలు 21,515 ఉన్నారు. అల్లాపూర్(బి)లో పురుషులు 308, మహిళలు 326, బాబునాయక్‌తండాలో పురుషులు 342, మహిళలు 363, బద్లాపూర్‌లో పురుషులు 163, మహిళలు 189, బద్లాపూర్‌తండాలో పురుషులు 251, మహిళలు 287, బషీరాబాద్‌లో పురుషులు 2801, మహిళలు 3032, భోజ్యానాయక్‌తండాలో పరుషులు 555, మహిళలు 536, దామర్‌చెడ్‌లో పురుషులు 784, మహిళలు 861, ఎక్మాయిలో పురుషులు 1251, మహిళలు 1388, గంగ్వార్‌లో పురుషులు 195, మహిళలు 230మంది ఉన్నారు. గొట్టిగఖుర్దులో పురుషులు 343, మహిళలు 433, గొట్టిగకలాన్‌లో పురుషులు 331, మహిళలు 386, హంక్యానాయక్‌తండాలో పురుషులు 156, మహిళలు 166, ఇందర్‌చెడ్‌లో పురుషులు 306, మహిళలు 368, ఇస్మాయిల్‌పూర్‌లో పురుషులు 218, మహిళలు 220, జలాల్‌పూర్‌లో పురుషులు 312, మహిళలు 379మంది ఉన్నారు. జీవన్గిలో పురుషులు 1301, మహిళలు 1491, కంసాన్‌పల్లి(ఎం)లో పురుషులు 194, మహిళలు 202, కాశీంపూర్‌లో పురుషులు 428, మహిళలు 528, కంసాన్‌పల్లి(బి)లో పురుషులు 390, మహిళలు 415 మంది ఉన్నారు. కొర్విచెడ్‌లో పురుషులు 406, మహిళలు 450, కొర్విచెడ్‌ఘనిలో పురుషులు 511, మహిళలు 553మంది ఉన్నారు. కొల్లాపూర్‌లో పురుషులు 426, మహిళలు 444, కుప్పన్‌కోట్‌లో పురుషులు 250, మహిళలు 277, క్యాద్గీరాలో పురుషులు 431, మహిళలు 409, మైల్వార్‌లో పురుషులు 1333, మహిళలు 1469, మల్కన్‌గిరిలో పురుషులు 139, మహిళలు 183, మంతన్‌గౌడ్‌లో పురుషులు 209, మహిళలు 240మంది ఉన్నారు. మంతన్‌గౌడ్‌తండాలో పురుషులు 411, మహిళలు 478, మంతట్టిలో పురుషులు 787, మహిళలు 871, మర్పల్లిలో పురుషులు 269, మహిళలు 314, మసాన్‌పల్లిలో పురుషులు 191, మహిళలు 224, నంద్యానాయక్‌తండాలో పురుషులు 303, మహిళలు 364, నవాల్గలో పురుషులు 771, మహిళలు 870, నవాంద్గిలో పురుషులు 424, మహిళలు 479, నీళ్లపల్లిలో పురుషులు 403, మహిళలు 416మంది ఉన్నారు. పర్వత్‌పల్లిలో 529, మహిళలు 568, పర్యానాయక్‌తండాలో పురుషులు 169, మహిళలు 178, రెడ్డిఘణాపూర్‌లో పురుషులు 592, మహిళలు 635, వాల్యానాయక్‌తండాలో పురుషులు 288, మహిళలు 290 మంది ఉన్నారు.

నేనే.. ఉపసర్పంచ్!

(ఐదో పేజీ తరువాయి)

గెలుపొందడానికి అవసరమైన సహకారం అందిస్తామంటూ ఆశావహులు కొందరు వార్డు సభ్యులను ముందుగానే ముగ్గులోకి దింపుతున్నారు. ఉప సర్పంచ్ పదవులను ఆశిస్తున్న మరికొందరు ముందుగానే విజయావకాశాలు ఉన్న వార్డు సభ్యులకు గుడ్ విల్ అందించి ఒప్పందం చేసుకుంటున్నారు. కొందరు ముందుగానే పంచాయతీలోని కొన్ని వార్డులను ఏకగ్రీవం చేసుకుని తమ ఎన్నికకు మార్గం సుగమం చేసుకున్నారు. అవకాశం ఉంటే ఏకగ్రీవంగా, లేదంటే ఎక్కువ మంది వార్డు సభ్యుల మద్దతుతో ఎన్నికయ్యే విధంగా వారు పావులు కదుపుతున్నారు.

అధికారం చెలాయించేలా..

మండల కేంద్రాలు, పెద్ద పంచాయతీలతో పాటు రాజకీయంగా ఆధిపత్యం కొనసాగే పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవులకు పోటీ నెలకొంది. మైనింగ్, పరిశ్రమలు, ఫామ్‌హౌస్‌లు, వ్యాపార కేంద్రాలుగా కొనసాగుతున్న పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవులను కైవసం చేసుకునేందుకు పోటాపోటీగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇది వరకు సర్పంచులుగా, ఎంపీటీసీ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించి.. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేయాలని ఆశాభావంతో ఉన్నా రిజర్వేషన్లు కలిసి రాని వారు ఈ పదవులపై కన్నేశారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌దీ కీలక పాత్ర కావడంతో ఆ పదవికి డిమాండ్ పెరిగింది. సర్పంచులతో సమానంగా అధికారం చెలాయించే అవకాశం ఉండడంతో ఉప సర్పంచ్ పదవిపై మక్కువ పెంచుకుంటున్నారు.

జాయింట్ చెక్ పవర్‌తోనే...

జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈనెల 11, 14, 17వ తేదీల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ జరిగే రోజు మధ్యాహ్నం 2 గంటలకు బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఫలితాలు ప్రకటించిన తర్వాత అదే రోజు గెలుపొందిన వార్డు సభ్యుల్లో ఒకరిని ఉప సర్పంచ్ గా ఎన్నుకుంటారు. చెయ్యెత్తే విధానంలో ఉప సర్పంచ్ ఎన్నిక జరగనుంది. గతంలో పంచాయతీ నిధుల వినియోగంలో చెక్‌పవర్ సర్పంచ్, కార్యదర్శికి ఉండేది. దీంతో ఉప సర్పంచ్ పదవిని నామమాత్రంగానే భావించేవారు. ఉప సర్పంచులకు చెక్ పవర్ ఉండే విధంగా ఏడేళ్ల కిందట పంచాయతీరాజ్ చట్టంలో మార్పు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. తొలి విడతలో 2,109 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, వాటిలో 19 వార్డులకు నామినేషన్లు దాఖలు కాకపోవడంతో ఎన్నికలు నిర్వహించడం లేదు. 652 వార్డులు ఏకగ్రీవం కాగా, 1,527 వార్డులకు 3,953 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. రెండో విడతలో 1,520 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, 294 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 1,226 వార్డుల్లో 3,164 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మూడో విడతలో 1,340 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, నామినేషన్ల పరిశీలన వరకు 2938 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఏకగ్రీవమైన వార్డుల వివరాలపై నామినేషన్ల ఉప సంహరణ తర్వాత స్పష్టత రానుంది.

'స్మార్ట్'గా ఎన్నికల ప్రచారం



బషీరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో స్థానిక పోరులో స్మార్ట్ ప్రచారం జరుగుతోంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు బరిలో నిలిచిన అభ్యర్థులు సామాజిక మాధ్యమాలను విరివిగా ఉపయోగిస్తూ తమదైన శైలిలో ప్రచారం చేసుకుంటున్నారు. మారుమూల పల్లెలోనూ వాట్సాప్ గ్రూపుల ద్వారా ఎవరికి వారు తమను గెలిపించాలని పోస్టులు పెడుతున్నారు. తమను పంచాయతీ ఎన్నికల్లో సర్పంచుగా గెలిపిస్తే ఏం చేస్తామనేది స్మార్ట్‌గా ప్రచారం చేసుకుంటున్నారు. పంచాయతీల వారీగా ప్రత్యేక గ్రూపులు రూపొందించి వాటి వేదికగా ఎప్పటికప్పుడూ తాజా ప్రచారాల వీడియోలు, ఫొటోలను ఓటర్లతో పంచుకుంటున్నారు. పల్లెల్లో ఆటోలు, జీపుల మైకుల ప్రచారం ఎక్కడా కనిపించడంలేదు.

హ్యాకథాన్‌లతో నైపుణ్యాలు పెంపొందుతాయి

- నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి



స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నల్ల మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): హ్యాకథాన్‌లలో పాల్గొడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతాయని నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి అన్నారు. పోచారం పరిధి దివ్యానగర్‌లోని నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్ల మల్లారెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన పలు ఇంజనీరింగు కళాశాలల 120మంది విద్యార్థులు ఆరుగురి చొప్పున టీంలు ఏర్పడి సాంకేతిక సమస్య పరిష్కారం దిశగా పరిశోధనలు చేస్తున్నారని తెలిపారు. 36గంటల పాటు సాగే ఈ హ్యాకథాన్ కేంద్ర ప్రభుత్వం సహకారంతో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి నల్ల దివ్య, డైరెక్టర్ నల్ల స్నేహ, ప్రిన్సిపాల్ రమేష్, వైస్‌ప్రిన్సిపాల్ రాజశేఖర్, సీఎస్‌సీ హెచ్‌వోడీ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయులు మధు

పూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్, రిటైర్డ్ హైకోర్టు జడ్జి డాక్టర్ డి.చంద్రయ్య అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి సంస్థ 20వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సేవా, ఉపాధ్యాయ, కళా, సాహిత్య రంగాల్లో కృషి చేసిన వారికి పురస్కారాలను అందజేశారు. ఇందులో భాగంగా పూడూరు మండల పరిధిలోని కడుమూరు పాఠశాల ఉపాధ్యాయులు మధు సేవలను గుర్తించి సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పురస్కారం, ఉపాధ్యాయ రత్న బిరుదును అందించి సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్, రిటైర్డ్ హైకోర్టు జడ్జీ డాక్టర్ డి.చంద్రయ్య మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధత కలిగి విద్యార్థులకు జ్ఞాన సంపద అందిస్తే విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు పెద్దలను గౌరవించడం, సామాజిక పోకడలను నేర్పడం వల్ల విద్యార్థులు ఉన్నంతగా ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షుడు వేముల గౌరీశంకర్‌రావు, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు, రచయిత బండారు సుజాత, లక్ష్మీ నాగశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురస్కారాన్ని అందుకున్న ఉపాధ్యాయుడు మధును మండల విద్యాధికారి సాయిరెడ్డితోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

మద్యం సరఫరాపై నిఘా

- వివరాలను గోప్యంగా ఉంచుతున్న అధికారులు

బొంరాస్‌పేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో సర్పంచ్ అభ్యర్థులు రవాణా చేస్తున్న మద్యం బాటిళ్ల పట్టుబడుతున్నాయి. తాజాగా ఆదివారం అర్ధరాత్రి బొంరాస్‌పేట్ మండలంలోని ఏర్పుమళ్ల గ్రామంలో ఓ సర్పంచ్ అభ్యర్థి తరలిస్తున్న రూ.లక్ష విలువ గల మద్యాన్ని పోలీసు అధికారులు సీజ్ చేశారు. ఈ విషయాన్ని సోమవారం మధ్యాహ్నం వరకు బయటకు రాకుండా ప్రయత్నం చేశారు. అయితే పోలీసులను వివరణ కోరగా ఆదివారం రాత్రి ఏర్పుమళ్లలో మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని మద్యం దుకాణం ముందు బెల్టు షాపుల యజమానులు, సర్పంచ్ అభ్యర్థులు మద్యం తరలిస్తుండటంతో పోలీసులు పటిష్ట నిఘా ఉంచి పట్టుకొని సీజ్ చేస్తున్నారు. ఎన్నికలకు రెండు రోజుల సమయం ఉండటంతో మంగళవారం సాయంత్రం మద్యం దుకాణాలు మూతపడనుండటంతో అభ్యర్థులు మద్యాన్ని జోరుగా గ్రామాలకు తరలిస్తున్నారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలి



బషీరాబాద్: ఫ్లాగ్‌మార్చ్‌లో ఎస్పీ స్నేహమెహ్రా, తాండూరు డివిజన్ పోలీసులు

బషీరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. పంచాయతీ ఎన్నికల దృష్ట్యా బషీరాబాద్ పోలీసులు సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే ఎవరిని ఉపేక్షించబోమన్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతోనే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, రూరల్ సీఐ ప్రవీణ్‌రెడ్డి, ఎస్ఐలు సుమాన్‌అలీ, శంకర్, విఠల్ రెడ్డి, పోలీస్ బలగాలు, క్విక్ రియాక్షన్ టీంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేముల్: మండలంలో సోమవారం తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య పర్యవేక్షణలో పోలీసులు రూట్‌మార్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంతో పాటు గాజీపూర్‌లో లా అండ్ ఆర్డర్ ప్రత్యేక బృందాలు క్యూఆర్‌టీ టీం, ఆర్మ్‌డ్ ఫోర్స్ సిబ్బంది రూట్ మార్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, పెద్దేముల్ ఎస్ఐ శంకర్, సబ్‌డివిజన్ పోలీసులు పాల్గొన్నారు.



పెద్దేముల్ మండలంలో రూట్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఓటు చోరీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి



మేడ్చల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రతీ పౌరుడు ఉద్యమించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాహుల్ యాదవ్ పిలుపునిచ్చారు. మేడ్చల్ పట్టణంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును దొంగలిస్తున్న బీజేపీ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు గుండ శ్రీధర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్, బుగ్గానగర్‌కు చెందిన అనిల్‌కుమార్(42) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. కుటుంబసభ్యులు గమనించి స్థానికుల సాయంతో కిందికి దించి ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అనిల్‌కుమార్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

పూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన పూడూరు మండలంలోని ఎన్కెపల్లి గేటు వద్ద జరిగింది. ఎన్కెపల్లికి చెందిన హరిశంకర్‌గౌడ్(23) సోమవారం సొంత గ్రామం నుంచి గేటు వైపు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన హరిశంకర్‌గౌడ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై చన్‌గోముల్ ఎస్సై భరత్‌రెడ్డిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బొలెరో వాహనం దగ్ధం

పూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగూడ చౌరస్తాలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో బొలెరో వాహనం దగ్ధమైంది. వాహనంలో పొగలు రావడం గమనించిన డ్రైవర్ అప్రమత్తమై వాహనంలో నుంచి కిందికి దూకడంతో పెను ప్రమాదం తప్పింది.

ధర్నా కేసులో కోర్టుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే



పరిగి కోర్టు ఆవరణలో పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రోడ్డుపై ధర్నా చేసిన కేసులో పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి సోమవారం పరిగి కోర్టుకు హాజరయ్యారు. పరిగిలో యూరియా కొరతపై గత ఆగస్టులో రైతులు రోడ్డుపైకి వచ్చారు. అప్పట్లో రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసులోనే సోమవారం పరిగి కోర్టుకు హాజరయ్యారు. కోర్టు దగ్గర మహేశ్‌రెడ్డికి మద్దతు అనుచరులు కూడా హాజరయ్యారు.

ఎన్నికల విధులకు గైర్హాజరైతే చర్యలు



పీవో, ఏపీవోల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో సృజన సాహిత్య

మోమిన్‌పేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని ఎన్నికల నిర్వాహణ అధికారి, ఎంపీడీవో సృజన సాహిత్య అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మొదటి విడత ఎన్నికల నిర్వహణ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎవరైనా గైర్హాజరైతే కఠిన చర్యలు ఉంటాయన్నారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అదేవిధంగా ఎన్నికల వ్యయం వివరాలను సర్పంచ్, వార్డు సభ్యుల వారీగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో యాదగిరి, వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణరెడ్డి, ఎన్నికల సిబ్బంది, రీసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాండూరు రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సంగెం కలాన్, కోటబాస్పల్లి, ఐనెల్లి, సరిగిరిపేట్, తదితర గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రచారం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల చరిత్రలో ఎన్నడూలేని విధంగా 25 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, రాజ్‌కుమార్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి

చౌడాపూర్: మల్కాపూర్ గ్రామానికి చెందిన చౌడాపూర్ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్‌నాయక్, రాజేందర్‌రెడ్డి, వెంకటయ్య, రాములు, నిరంజన్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు అసరమయ్యే పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమలకు అవసరమయ్యే పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని హరిత ఇండస్ట్రీ మేనిజింగ్ డైరెక్టర్ వెంకట రాజు తెలిపారు. పోచారం, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగు విద్యార్థులు సోమవారం పరిశ్రమల సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యపుస్తకాల సారాంశంతో పాటు పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. వివిధవిభాగాల తయారీ పద్ధతులు, ఉత్పత్తి ప్రక్రియలు, కల్పన సాంకేతికతలు, నాణ్యత ప్రమాణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగు విజయకుమార్, మెకానికల్ హెచ్‌వోడీ శ్రీనివాస చలపతి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి సిద్ధం



ఎన్నికల సామగ్రిని సిద్ధం చేస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

కొడంగల్ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల మొదటి విడతలో జరిగే ఎన్నికలకు అధికారులు సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. కొడంగల్‌లో ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సిబ్బంది పోలింగ్ కేంద్రలాల్లో అవసరమయ్యే సామగ్రిని సిద్ధంగా ఉంచారు.